

## కాశీనాథ & కాశీనాథ

విశాలమైన కాంపౌండ్ మధ్యగా విద్యుద్దీపాల కాంతిలో శకుంతలా నివాస్ మెరిసిపోతోంది.

ఆ కాంపౌండ్‌లో ఒక మూలగా దిష్టిచుక్క పెట్టినట్టుగా ఒక పాక, పనిమనిషి సీతమ్మది.

పోర్టికోలో కార్లు, స్కూటర్లు ఒక్కొక్కటే ఆగుతున్నాయి. ఖరీదైన దుస్తులు ధరించిన మనుషులు దిగుతున్నారు. ఎక్కువమంది స్త్రీలే. కొందరు పురుషులు భార్యల వెంట వచ్చారు.

గుమ్మం దగ్గిర కంచిపట్టు చీరలో, మెడలో రవ్వల నెక్లెస్‌తో ఇంటి యజమానురాలు శకుంతల నుంచుని ఉంది. పక్కన బ్రవున్ రంగు ఫుల్ సూటు వేసుకుని మెడలో బంగారు గొలుసు వేసుకుని శకుంతల అయిదేళ్ల కొడుకు శ్రీనివాస్ ఉన్నాడు. శకుంతల భర్త రమేష్ ఉదయమే అర్జంటు పనిమీద అనుకోకుండా వెళ్లాల్సి వచ్చింది.

ఒక్కొక్క వ్యక్తి వస్తున్నప్పుడల్లా శకుంతల 'రండి. లోపల కూర్చోండి' అంటూ ఆహ్వానిస్తోంది. శ్రీనివాస్ 'వెల్‌కమ్ టూ యూ' అంటున్నాడు. శ్రీనివాస్‌ని ముచ్చటగా చూస్తూ ఆహ్వానితులు లోపలికి వస్తున్నారు.

లోపల అంతా మొజాయిక్ ఫ్లోర్. డెకొలామ్ అమర్చబడిన రోజ్‌వుడ్ బల్లలు క్రమపద్ధతిలో అమర్చబడ్డాయి. సన్నగా ఇంగ్లీషు సంగీతం వినిపిస్తోంది. గాలి తెరలకి కర్టెన్లు కదులుతూ వింత అందాన్నిస్తున్నాయి. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది.

ప్రతి టేబుల్‌కి అటు రెండు, ఇటు రెండు కుషన్ కుర్చీలు ఉన్నాయి. ప్రతి టేబుల్‌మీద పాత్రల్లో పదార్థాలు మూత పెట్టబడి ఉన్నాయి.

అది శ్రీనివాస్ పుట్టినరోజు ఫంక్షన్.

ఇంత పార్టీలోనూ సర్వర్‌లు ఎక్కడా లేరు. సెల్ఫ్ సెర్వింగ్ అరేంజిమెంటు. రమేష్‌కీ, శకుంతలకీ ఈ పద్ధతే ఇష్టం. వాళ్ల ఇంట్లో నౌకర్లెవరూ లేరు, పనిమనిషి సీతమ్మ తప్ప.

ఎక్కడి ఏర్పాట్లు అక్కడ జరిగిపోవడంవల్ల శకుంతల హడావిడిగా లేదు.

ఆహ్వానితులంతా సీట్లలో కూర్చున్నారు.

విందు ప్రారంభం అయింది.

శకుంతల ప్రతీ టేబులు దగ్గరికీ వెళ్లి అతిథుల్ని పలకరిస్తోంది. ఏంకావాలని అడుగుతోంది. 'వాంటె నీ థింగ్ మోర్ ?' అంటున్నాడు శ్రీనివాస్.

అతిథులందరినీ శ్రీనివాస్ చాలా ఆకర్షించాడు. అసలే చూడటానికి అందంగా ఉన్నాడు, కాన్వెంటులో నేర్చుకున్న స్వచ్ఛమైన ఉచ్చారణతో ఇంగ్లీషు మాటలు పలుకుతూ ఉంటే చూసేవాళ్లకి ముచ్చటగా ఉంది. 'అయిదేళ్ల పిల్లవాడి పుట్టినరోజుకి పెద్ద వాళ్లం రావటం దేనికి?' అని వచ్చేముందు అనుకున్న ఆహ్వానితులకి ఇప్పుడు ఆ ఊహే లేదు.

పార్టీ అయిపోయింది. అతిథులు ఒక్కొక్కళ్లే వెళ్లిపోతూ ఉంటే శ్రీనివాస్ 'సీయూ ఎగైన్' అంటున్నాడు. కొంత మంది ఆనందం పట్టలేక శ్రీనివాస్‌ని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నారు.

శకుంతల తృప్తిగా చూసింది.

* * *

పని మనిషి సీతమ్మ అయిదేళ్ల కొడుకు సీముతో వచ్చి ప్లేట్లన్నీ కడగటానికి తీసి టేబుల్స్ శుభ్రం చేస్తుంటే శకుంతల మేడ మీదికి వెళ్లింది. శ్రీనివాస్‌కి బట్టలు మార్చి లాల్చీ, పైజమా తొడిగింది. పది నిమిషాలు వాడితో కబుర్లు చెప్పి వాడికి నిద్ర వస్తుంటే ఫోమ్ బెడ్‌పై పడుకోబెట్టింది.

విశ్రాంతిగా అయిదు నిమిషాలు పడుకుంది.

ఉన్నట్టుండి 'వెల్‌కమ్ టూ యూ' అని వినపడింది శకుంతలకి. శకుంతల నవ్వుకుంది.

'నిద్రలో కూడా బాబు కలవరిస్తున్నట్టున్నాడు' అనుకుంది.

'మళ్లీ వెల్‌కమ్ టూ యూ' అని వినపడింది.

శకుంతల బాబుకేసి చూసింది.

బాబు కలవరించటం లేదు !

గాఢంగా నిద్రపోతున్నాడు.

'మరి ఆ మాట ఎక్కడిది ?'

మళ్లీ 'వెల్‌కమ్ టూ యూ' అని వినపడగానే శకుంతల లేచి కిటికీ దగ్గరకి వెళ్లింది. కిందికి చూసి ఆశ్చర్యపోయింది !


విందులో మిగిలిన పదార్థాలన్నీ ప్లేట్లలో అమర్చి ఉన్నాయి. ఆ ప్లేట్ల ముందు సీము స్నేహితులు కూర్చుని ఉన్నారు. సీము ఒక్కొక్కళ్ల దగ్గరికీ వెళ్లి 'వాంటె నీ థింగ్ మోర్ ?' అంటూ వడ్డిస్తున్నాడు. వాళ్లు ఆత్రంగా తింటున్నారు.

ఏమీ పరిచయం లేని ఇంగ్లీషు మాటలు నాలుగు సార్లు విని అదే స్పష్టతతో, అదే మాడ్యులేషన్‌తో అనగలిగిన సీము ధారణశక్తికి ఆశ్చర్యపోయింది శకుంతల.

అయిదు నిమిషాల తర్వాత శకుంతల కిందికి వెళ్లింది. ఒక్కొక్కళ్లే బయటికి వెడుతోంటే 'సీ యూ ఎగైన్' అంటున్నాడు సీము.

శకుంతలని చూసి వాళ్లంతా భయపడి కంగారుగా




# పుట్టిన రోజు

పారిపోయారు. సీతమ్మ భయంగా శకుంతల కేసి చూసింది.

మేడ మీదికి రమ్మని సీతమ్మకి సైగచేసి పైకి నడిచింది శకుంతల.

సీతమ్మ భయపడుతూనే పైకి వచ్చింది.

'ఏమిటే హడావిడి ?' అంది శకుంతల,

యజమానురాలి మొహంలో ప్రసన్నత చూసి సంబాళించుకుంది సీతమ్మ.

'ఇవాళ మా సీను పుట్టిన రోజండి' అంది.

శకుంతల ఒళ్లు ఝల్లుమంది.

'మీరు నెప్పులు పడుతున్నప్పుడే ముందున్న పాకలో నాకూ నెప్పులు వచ్చాయండి. మీకు డాక్టరమ్మ గారు, నర్సులు వచ్చి పురుడు పోశారండి. నాకు మా అక్కయ్య వచ్చి పురుడు పోసిందండి. చిన బాబుగారు పుట్టిన టైముకి ఒక నిమిషం అటూ ఇటూగా మా సీమవాములు పుట్టాడంటండి. మా మావ చెప్పాడు' అంది.

సీతమ్మని పంపించేసింది శకుంతల.

పై అంతస్తులోకి వెళ్లింది చల్లగాలి కోసం. అక్కడే మేటన్ పై పడుకుని అనంతకాశంలోకి చూస్తూ కూర్చుంది. నక్షత్రాలని దగ్గరలో నుంచి చూస్తున్నట్టు ఉంది.

మనసులో ఆలోచనలు వస్తున్నాయి. ఊహ విస్తరిస్తోంది.

సరిగ్గా అయిదు సంవత్సరాల క్రితం ఈ ఇంట్లో పుట్టమని ఇద్దరు జీవుల్ని భగవంతుడు పంపించాడు. ఇద్దరూ గేటు దగ్గరకి వచ్చాక ఒక జీవి ఆవరణలో అవుట్ హౌస్ లాగా ఉన్న పాకలోకి వెళ్లాడు! మరొక జీవి భవనంలోకి వచ్చి నోట్లో వెండి స్పూనుతో పుట్టాడు!

భగవంతుడు ఎవర్ని ఎక్కడికి పంపించాడో?

ఈ ఇంటి ఆవరణలో ఎవరు ఎక్కడికి వెళ్లాలో ఆ భగవంతుడు చెప్పింది వీళ్లు సరిగ్గా విన్నారో లేదో ? పొరపాటున తారుమారు కాలేదు గదా !

శకుంతల కళ్లలో నీళ్లు నిండాయి.

ఫోమ్ బెడ్ పై పడుకున్న శ్రీనివాస్, క్రింద చింకి చాపపై పడుకున్న సీను ఇద్దరూ తనబిడ్డల్లాగే అనిపించింది శకుంతలకి. ★



పసుపు కుంకుమలతో ఎప్పుడు ఈ 'రాగమాలిగ' చీరల్నే కట్టుకుంటూ ఆనందంగా ఉండాలమ్మా!

రాగమాలిగ పట్టు చీరలు.

సుగన్ ఆర్కేడ్,

పానగల్ పార్కువద్ద వాగేశ్వరరావు రోడ్, టి. నగర్,

మద్రాసు – 600017.

[ఆదివారం షాపు తెరిచే వుంటుంది.]